

నిరంతరం సెక్యూరిటీ పర్యవేక్షణ ఉండాలి

రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్య సిబ్బందికి భద్రత కల్పించేందుకు ఏర్పాటు చేసిన సెక్యూరిటీ నిరంతరం పర్యవేక్షించాలి. అర్ధరాత్రి ఒంటి గంట తరువాత సెక్యూరిటీ సిబ్బంది విశ్రాంతి తీసుకుంటున్నారు. అలా కాకుండా ఉదయం వరకు నిరంతరం సెక్యూరిటీ సిబ్బంది ఆస్పత్రిలో రౌండ్స్ వేయాలి. మహిళా వైద్య సిబ్బందికి భద్రతతోపాటు అవసరమైన అన్ని సౌకర్యాలు ఆస్పత్రుల్లో కల్పించాలి.

– వి.జ్యోతి, స్టాఫ్ నర్స్, విమ్స్



శిక్షల అమలు వేగవంతంగా ఉండాలి



వైద్య రంగంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ఎవరైనా దాడులకు తెగబడితే వారి విచారణ ఆలస్యం కాకుండా వేగవంతంగా విచారణ జరిపి శిక్షలు అమలు జరపాలి. అటువంటి నూతన చట్టాలు రావాలి. కొన్ని సందర్భాల్లో రోగుల బంధువుల నుంచి కూడా దాడులు ఉంటాయి. వారి నుంచి రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. రోగులకు దగ్గరగా ఉండే వైద్య విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరం.

– డాక్టర్ పి.విజయ్‌కుమార్, జనరల్ మెడిసిన్

నీరుగారిన లక్ష్యం

- నిరుపయోగంగా జీవీఎంసీ కంపోస్ట్ యూనిట్
- నిలిచిపోయిన చెత్త ప్రాసెసింగ్
- కొండెక్కిన స్వచ్ఛత పరికరాలు



తడి చెత్తను ప్రాసెస్ చేసే డ్రమ్ముల సముదాయం



లాసన్స్ బే కాలనీలో ఏర్పాటు చేసిన జీవీఎంసీ కంపోస్ట్ యూనిట్

ఎంవీపీకాలనీ: చెత్తను ప్రాసెసింగ్ చేయాలన్న జీవీఎంసీ లక్ష్యం నీరుగారుతోంది. 19వ వార్డు లాసన్స్ బే కాలనీలో బీచ్‌ను ఆనుకొని ఉన్న డ్రమోర్గానిక్ వెట్ వేస్ట్ కంపోస్ట్ యూనిట్‌ను గతంలో జీవీఎంసీ ఏర్పాటు చేసింది. దీన్ని కొంతకాలంగా వినియోగించకుండా వదిలేయడంతో అది నిరుపయోగంగా మారింది. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సేకరిస్తున్న తడి చెత్తను ఎరువుగా మార్చాలనేది ఈ యూనిట్ లక్ష్యం. కొంతకాలానికే ఈ యూనిట్ మూతపడటం, దీన్ని జీవీఎంసీ పూర్తిగా పట్టించుకోకపోవడంతో రూ.కోట్లు విలువ చేసే ఈ యూనిట్‌లోని పరికరాలు తుప్పు పట్టిపోతున్నాయి. ప్రజాధనం వృథాపై పలువురు జీవీఎంసీ తీరును ఆక్షేపిస్తున్నారు.

ఇదీ ప్రాజెక్టు లక్ష్యం

స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించే దిశగా తీసుకుంటున్న చర్యల్లో ఇది కూడా భాగం. నగరంలోని తడి చెత్తను సేకరించి దాన్ని ప్రాసెస్ చేయడం ద్వారా వినియోగంలోకి తేవాలనే లక్ష్యంతో ఈ యూనిట్ ఏర్పాటైంది. ఎంఎస్ఎఫ్–3 పేరిట రూ.కోటికి పైగా ఖర్చుతో భారీ యంత్రాలతో కూడిన యూనిట్‌ను 2015–16 మధ్య అందుబాటులోకి తెచ్చారు. కొంతకాలం ఈ యూనిట్ ద్వారా జీవీఎంసీ సజావుగా సేవలు అందిపుచ్చుకుంది. రోజుకు 2 వేల కేజీల సామర్థ్యంతో చెత్తను ఒక్కో డ్రమ్ములో వేసి ప్రాసెసింగ్ నిర్వహించే వారు. కన్వేయర్ బెల్ట్ సాయంతో ఈ డ్రమ్ములను తిప్పుతూ 18 రోజులకు ఎరువును అందుబాటులోకి తెచ్చేవారు.



తుప్పు పట్టిన కన్వేయర్ బెల్ట్ సముదాయం

తరలింపు చర్యలు శూన్యం

ఈ యూనిట్‌లో చెత్త ప్రాసెసింగ్ కారణంగా పెద్ద ఎత్తున దుర్గంధం వెదజల్లుతుందంటూ స్థానిక గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. దీంతో ఈ యూనిట్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ప్రాసెసింగ్ సమయంలో వ్యర్థాల కారణంగా భరించలేని వాసన వస్తోందంటూ అప్పుఘర్, వాసవానిపాలెం, శివగణేష్ నగర్ ప్రజలు ఆందోళనలు చేపట్టారు. ఈ యూనిట్‌ను నగర శివార్లకు తరలించాలనే జీవీఎంసీ అప్పట్లో ఆలోచన చేసినప్పటికీ.. అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో విలువైన ఇక్కడి ప్రాసెసింగ్ యంత్రాలు రోజురోజుకు తుప్పుపట్టి నిరుపయోగంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రయోజనకర చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సంప్రదాయ నృత్యాలకు విశేష ఆదరణ



భరతనాట్యం చేస్తున్న కళాకారిణులు

బీచ్‌రోడ్డు: భరతనాట్య కళాంజలి పదో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గురజాడ కళాక్షేత్రంలో సంస్థ 150 మంది విద్యార్థినులచే నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకట కుమారి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువత మన రాష్ట్ర, దేశ సంప్రదాయ నృత్యాలు నేర్చుకోవడం ఎంతైనా అవసరమన్నారు. విశాఖ ఆర్డర్ డ్యాన్సర్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకటరమణారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నాట్యం నేర్చుకోవాలనుకుంటే ప్రస్తుత పాఠశాలల్లో నాట్యాన్ని పాఠ్యాంశంగా రాష్ట్ర ప్రభుత్వం చేయాలని సూచించారు. నాట్యాన్ని పాఠ్యాంశంగా చేర్చినట్లయితే విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురు హరి రామ్మూర్తి, భరతనాట్య కళాంజలి అధ్యక్షులు గురువుని సంతోషి విజయ్, వసుంధర థామస్, ఎస్.ఎస్.వి.సత్యభాను తదితరులు పాల్గొన్నారు.

‘శ్రావణలక్ష్మి’ల ర్యాంప్ వాక్ అదరహో



సంప్రదాయ ర్యాంప్ వాక్‌లో పాల్గొన్న మహిళలు

బీచ్‌రోడ్డు: క్వీన్స్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శ్రావణ లక్ష్మి పేరుతో ఆదివారం నిర్వహించిన సంప్రదాయ ర్యాంప్ వాక్ విశాఖ వాసులను విశేషంగా అలరించింది. సిరిపురంలోని ఒక హోటల్‌లో జరిగిన ర్యాంప్ వాక్‌లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశాల నుంచి హాజరైన పలువురు మహిళలు సంప్రదాయ చీరకట్టుతో మిసెస్ శ్రావణ లక్ష్మి విభాగంలో, పరికిణి ఓణీలతో యువతులు మిస్ శ్రావణ లక్ష్మి విభాగంలో ర్యాంప్‌పై నడుస్తూ అదరహో అనిపించారు. ముఖ్య అతిథులు వైఎస్సార్‌సీపీ సీనియర్ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, రమా సత్యనారాయణ, విజయస్వాతితో కలిసి క్వీన్స్ ఈవెంట్స్ నిర్వాహకురాలు మోదవలస ఉషారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిసెస్ శ్రావణ లక్ష్మి విభాగంలో ర్యాంప్‌పై వాక్ చేసిన అనంతరం లక్ష్మీదేవి, శ్రావణ మాసం, పసుపు కుంకుమ, తాంబూలం తదితర అంశాలపై మహిళలు వివరించిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సంగీత, స్వర్ణలత, మాధురి, నక్షత్ర వ్యవహరించారు.

యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని స్వాగతిస్తున్నాం



రైల్వే స్టేషన్ వద్ద సంబరాలు చేసుకుంటున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ శ్రేణులు

తాటిచెట్లపాలెం : పాత జాతీయ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ, దాని స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని శనివారం కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజినల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా రామమోహన్ రావు ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వే స్టేషన్ వద్ద యూనియన్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత దుర్మార్గమైన, సంఘటిత రంగంలోని కార్మికుల సామాజిక భద్రతకు సవాలుగా నిలిచిన పాత జాతీయ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని రైల్వే మెన్స్ ఫెడరేషన్, తమ యూనియన్ జరిపిన రాజీలేని పోరాటానికి కేంద్రం దిగి వచ్చిందని తెలిపారు. రెండు దశాబ్దాలుగా ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ నాయకులు శివగోపాల్ మిశ్రా, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ జోనల్ నాయకులు పీకే పట్నాయక్ నాయకత్వంలో చేపట్టిన నిరసనలు, ఆందోళనల ఫలితమే యూనిఫైడ్ పెన్షన్ స్కీం అని వక్తలు తెలిపారు. ఈ పెన్షన్ స్కీం వల్ల యువత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరడానికి ఆసక్తి చూపిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మరిన్ని పోరాటాలు చేసేందుకు కార్మికులు సిద్ధంగా కావాలని పిలుపునిచ్చారు. సంబరాల్లో కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు, శ్రామిక్ యూనియన్ శ్రేణులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

మురళీనగర్ : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పరిశ్రమల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకరరెడ్డి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో (గైస్) సేఫ్టీ కోర్సుల విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీతోపాటు అక్కడ పనిచేసే ఉద్యోగుల భద్రత సేఫ్టీ విభాగం సిబ్బంది పనితీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇండస్ట్రియల్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ కోర్సులు చేసిన వారికి విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం సేఫ్టీ పోకస్ పత్రికను ఆయన ఆవిష్కరించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎన్ఆర్ సురేష్, ఆర్.మాధవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు, జగన్నాథ సుభద్ర బలభద్రులు

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు ఆదివారం శ్రీ రాధాదామోదరులు, జగన్నాథ, సుభద్ర, బలభద్రుల విగ్రహాలను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రత్యేక భక్త బృందంచే ఉదయం 8 గంటలకు అఖండ హరినామ సంకీర్తన మొదలైంది. పుణ్య నదుల నుంచి సేకరించిన జలాలు, పంచామృతాలతో భక్తులు స్వయంగా స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అత్యంత రమణీయంగా అలంకరించిన స్వామిని ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు దర్శనం చేసుకుని పునీతులయ్యారు. అనంతరం బాలగోపాలుడికి ఉయ్యాల సేవ చేశారు. కొందరు భక్తులు 108 సార్లు హరేకృష్ణ నామాన్ని జపించారు. ప్రముఖ గాయకులు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు, నృత్యకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవని శ్రీకృష్ణుడి లీలలపై చేసిన ప్రవచనాలు భక్తులను భక్తి పారవశ్యంతో ముంచెత్తాయి.

ఉత్సాహంగా వీఎంఆర్‌డీఏ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్



టీ షర్ట్ ఆవిష్కరిస్తున్న వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, సంయుక్త కమిషనర్ రవీంద్ర

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో ఆదివారం స్పోర్ట్స్ మీట్ 2024 నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలు ప్రారంభించారు. వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, సంయుక్త కమిషనర్ వి.రవీంద్ర, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డివిజనల్ ఫారెస్టు అధికారి శాంతి స్వరూప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వివేకానందుడి ఆశయాలు నెరవేరుద్దాం

మురళీనగర్: స్వామి వివేకానందుడి ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటి సాధనకు కృషి చేయాలని వివేకానంద యువ మహా మండలి అధ్యక్షుడు పి.మునిస్వామి పిలుపునిచ్చారు. విశాఖ వివేకానంద యువ మహామండలి వార్షిక సమావేశాన్ని మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు ఎక్కువగా సభ్యులుగా చేరేలా చైతన్యపరచాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో యువ మహామండలి నూతన శాఖలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కాకినాడలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రతినిధి వీఆర్‌కే శర్మ మాట్లాడుతూ భారతదేశం గురించి తెలుసుకోవాలంటే వివేకానందుడి జీవితాన్ని అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.హృదయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంస్కృతంలో శిక్షణ



శిక్షణ శిబిరంలో ట్రస్టు సభ్యులు

సీతమ్మధార: మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్, సంస్కృత భారతి సంయుక్తంగా విద్యార్థులకు సంస్కృతంలో ఉచిత శిక్షణను చోడవరం జూనియర్ కళాశాల లెక్చరర్ రేణుక కిషోర్, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్ల వెంకటరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి పది రోజులు పెద్దలకు సంస్కృత తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



గ్రంథాలయ కార్యవర్గ సభ్యులకు పుస్తకాలు అందజేస్తున్న ఆడారి కొండలరావు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టలో ఉన్న శ్రీ వెంకట గౌరీశంకర గ్రంథాలయానికి సీనియర్ జర్నలిస్టు ఆడారి కొండలరావు సుమారు రూ.20 వేల విలువ గల సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాహిత్య గ్రంథాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలన్నారు. జ్ఞానం, విజ్ఞానం, పరిజ్ఞానాన్ని అందించే దేవాలయాలుగా కొనియాడారు. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా మనిషికి మిగిలేది అజ్ఞానమే అన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చినిగిన చొక్కా అయిన వేసుకో, కానీ మంచి పుస్తకాన్ని వదులుకోకు అని రచయిత చలం అన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కంటిపై ఒత్తిడి తగ్గించాలి

మురళీనగర్: జ్ఞానేంద్రియాల్లో అతి ముఖ్యమైన కంటిపై ఒత్తిడి తగ్గించాలని శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ శశి, సమృద్ధి, ఆర్.దేశ్‌ముఖ్ సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. ఏడాదికోసారి తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 174 మందికి వైద్య పరీక్షలు చేయగా వారిలో 36 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని సిఫారసు చేశారు.

ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతమ్మధార: ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. ఫోరం ఆధ్వర్యంలో డాక్టర్ లంకలపల్లి బుల్లయ్య కళాశాలలో ఆదివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో నగరానికి చెందిన విద్యావేత్తలు, భాషాభిమానులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్యా విధానంపై ప్రకటన చేయాలని కోరారు. విద్యా హక్కు చట్టం – 2010 ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే కొనసాగించాలన్నారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ప్రజలకు హక్కులతోపాటు బాధ్యతలూ ఉన్నాయని, వాటిని తెలుసుకోవాలన్నారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. పలువురు వ్యక్తలు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను తప్పనిసరిగా మాతృభాషలోనే అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యమూర్తి, పి.కన్నయ్య, వేదుల కామేశ్వరరావు, మేడ మస్తాన్ రెడ్డి, హుస్సేన్, చాట్ల బాబురావు రెడ్డి, సుజాత, బ్రహ్మకుమారి, రామేశ్వరి పాల్గొన్నారు.

వైద్యురాలిపై దాష్టీకం దారుణం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, ఉపాధ్యాయులు, పౌరులు

సీతమ్మధార: కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన దారుణ కృత్యాన్ని వ్యతిరేకిస్తూ పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాష్టీకాలను ఖండించాలన్నారు. నేరస్తులకు శిక్షలు పడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పౌర చైతన్య వేదిక నాయకులు సి.హెచ్. ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు పడాల వీరభద్రరావు, ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర సలహాదారులు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు కొలవెన్ను, డాక్టర్ వెంకట రమణ, సత్యవతి, పొన్నాడ శ్రీనివాసరావు, ధర్మేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణులు



నృత్య రూపకం

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పారామం(జాతర)లో ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. సాలూరుకు చెందిన పూర్ణిమ కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు చూడచక్కని నృత్యాభినయంతో అలరించారు. గణపతి స్తుతి గీతంతో కార్యక్రమం ప్రారంభం కాగా.. మహిషాసుర మర్దిని నృత్య రూపకం ప్రదర్శనలో హైలెట్‌గా నిలిచింది. అఖిలాండేశ్వరి, ప్రణవాలయం పాణి, హరహర మహదేవ, నెమలికి నేర్పిన నడకలివీ, అయిగిరి నందిని వంటి గీతాలకు అద్భుతంగా కూచిపూడి నృత్యం చేసి అలరించారు. పూజిత, చైత్ర, దివ్య చంద్రిక, మోక్షిత, సాయి కౌస్విత, గుణప్రియ ఈషిత, జ్యోషిత, గీతశ్రీ మెదలగు కళాకారులు పాల్గొనగా.. పూర్ణిమానాయుడు నృత్య దర్శకత్వం వహించారు.

క్లుప్తంగా

వెంకోజీపాలెంలో అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలో కొలువైన కనకమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. రాధాకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సేవా సంఘం ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న గోవింద్

బీచ్‌రోడ్డు: పెదగదిలిలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. విశాఖ టీడీపీ పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరి గోవింద్ హాజరై భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు చివ్వేటి పైడిరాజు, పిట్టా శంకరరావు, రాయి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రియా యోగాలో డాక్టరేట్



శిష్యుడు ఆదిత్యను అభినందిస్తున్న అధ్యాపకుడు ఉమామహేశ్వరరావు

మద్దిలపాలెం: క్రియా యోగా అంశంలో పరిశోధనను తన నిర్దేశకత్వంలో దిగ్విజయంగా పూర్తి చేసి డాక్టరేట్ స్వీకరించిన విద్యార్థి ఆదిత్యను డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృతం అధ్యాపకుడు పి.ఉమామహేశ్వరరావు అభినందించారు. ఆదివారం ఆదిత్య తన గురువు ఉమామహేశ్వరరావును కలిసి తనకు అందించిన సహాయ, సహకారాలకు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సాధించాలనే తాపత్రయం, పట్టుదలతో కృషి చేసి ఆదిత్య తన లక్ష్యాన్ని చేరుకున్నాడని కొనియాడారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: తగాదాలు, కొట్లాటల్లో రౌడీషీటర్లు తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని ద్వారకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ధర్మేంద్ర సూచించారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో ప్రమేయం ఉన్న రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ ఆదేశాల మేరకు ఎస్ఐ ధర్మేంద్ర ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లను ఆదివారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేసి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అందరితో మాట్లాడి వారి రోజువారీ కార్యకలాపాలు, వారు ఏయే కేసుల్లో నిందితులుగా ఉన్నారో తెలుసుకున్నారు. సమాజంలో అల్లర్లు సృష్టించినా, గొడవల్లో దూరినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.